9440662699 www.rajadhanivartalu.com rajadhaniv rajadhaniv rajadhanivartalu RNI No. APTEL 2015/ 66622




# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 2 సంచిక 50, పేజీలు 4 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 4 - ఆదివారం 10, సెప్టెంబర్-2017

# నేడు మంత్రివర్గ విస్తరణ

- ఎన్నికలున్న రాష్ట్రాలకు ప్రాధాన్యం
- గడ్కరీకి రైల్వే, ప్రకాశ్ జవదేకర్‌కు రక్షణ, ప్రభుకు పర్యావరణ శాఖలు.....
- జేడీ ( యూ)కూ ప్రాతినిధ్యం



**న్యూఢిల్లీ :** ప్రధాని మోడీ మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఆదివారం ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో జరగనుంది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కొన్ని కొత్త ముఖాలతో పాటు కొందరు మంత్రులకు ఉద్వాసన జరుగుతుందని వినిపిస్తోంది. నైపుణ్యాభివృద్ధి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శాఖ సహాయమంత్రి ప్రతాప్‌సింగ్ రూఢి ఇప్పటికే రాజీనామా చేశారు. ఆయన మోడీ మంత్రివర్గంలో సహాయమంత్రి అయినా స్వతంత్రంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరో ముగ్గురు సహాయమంత్రులు సంజీవ్ కుమార్ బల్యాన్, ఫగన్ సింగ్ కులస్తే, మహేంద్రనాథ్ పాండే కూడా ఇప్పటికే రాజీనామాలు సమర్పించారు. తెలంగాణ నుంచి మంత్రివర్గంలో కార్మిక శాఖ సహాయమంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న బండారు దత్తాత్రేయ కూడా రాజీనామా చేశారు. ఉద్వాసన పలకనున్న మంత్రులతో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా సమావేశమయ్యారు. వారి ఉద్వాసనకు కారణాలను ఆయన వివరించారని, భవిష్యత్తులో వారికి తగురీతిలో ప్రాధాన్యమిస్తామని నచ్చజెప్పినట్లు తెలిసింది. ఇదిలావుండగా, ఈ మంత్రివర్గంతోనే ఎన్నికలకు వెళ్లనున్నందున మోడీ, అమిత్‌షా జాగ్రత్తగా జాబితాను రూపొందించారు. గంగానది ప్రక్షాళన అంశంలో ఉమాభారతి పనితీరు సరాగ్గా లేదని, కొంతకాలంగా ప్రధాని అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. పార్టీ నేతలతో మంత్రివర్గంలో అవకాశం లభించే పేర్ల గురించి బీజేపీ ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్, పార్టీ ఉపాధ్యక్షుడు వినయ్ సహస్రబుద్ధె, ప్రహ్లాద్ పటేల్ సురేశ్ అంగడి, సత్యపాల్ సింగ్ ప్రహ్లాద్ జోషి అంతర్గతంగా చర్చలు జరిపారు. త్వరలో గుజరాత్ మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగడనున్నందున ఆయా రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని భావిస్తున్నారని తెలుస్తోంది. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు నేపథ్యంలో హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తన బృందావన్ పర్యటనను రద్దుచేసుకున్నారు. తమిళనాడుకు చెందిన ఏఐఏడీఎంకే మంత్రివర్గంలో చేరుతుందో లేదో స్పష్టంగా తెలియ రాలేదు.

**ప్రభుకు స్థానచలనం**

కొంతమంది మంత్రులకు ప్రమోషన్లు ఉండొచ్చని తెలుస్తోంది .ఇందులో భాగంగా ప్రకాశ్ జవదేకర్‌కు రక్షణశాఖను, గడ్కరీకి రైల్వే, సురేష్ ప్రభుకు స్థానచలనం తప్పదని ఆయనకు పర్యావరణ శాఖగానీ జలవనరుల శాఖ గానీ అప్పగించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

**ఉద్వాసనకు గ్రేడింగ్**

మంత్రులను తొలగించడంలోను, ప్రమోషన్లు కల్పించడంలోను ప్రధాని మోడి, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఒక ఫార్ములాను రూపొందించారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పనితీరు నచ్చని వారి పేరు ఎదుట 'పి' అని పనితీరు నచ్చిన వారిపట్ల పేరు ఎదుట 'ఎన్' గ్రేడింగ్ మార్కులు చేసి వాటి ఆధారంగా 'ఎన్' జాబితా మంత్రులను రాజీనామా కోరారని తెలుస్తోంది. రాజీనామా చేసిన కల్‌రాజ్‌మిశ్రా బండారు దత్తాత్రేయకు గవర్నర్ పదవులు కట్టబెట్టవచ్చునని విశ్వసనీయ వర్గాల కథనం. కొత్తగా ఎన్‌డీఏలో చేరిన నితీష్ కుమార్ జేడీ ( యూ) కూడా మంత్రివర్గంలో చేరే అవకాశాలున్నాయని, ఒక కేబినెట్ మంత్రిపదవి, రెండు సహాయ మంత్రిపదవులు లభించగలవని భావిస్తున్నారు. జేడీ( యూ) నేత నితీష్ తరపున రాజ్యసభలో పార్లమెంటరీ నాయకుడు ఆర్‌సీపీ సంగ్ సంతోష్‌కుమార్ మంత్రులుగా ప్రమాణం చేసే అవకాశాలున్నాయి. అయితే, ఏఐఏడీఏంకే పార్టీ మంత్రివర్గంలో చేరుతుందా లేదా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు ప్రధానితో కలిసి ప్రస్తుతం మంత్రివర్గంలో 73 మంది ఉన్నారు. గరిష్ఠంగా మంత్రివర్గంలో 81 మంది వరకు ఉండవచ్చు మొత్తం లోక్‌సభ సభ్యుల సంఖ్యకు (545) 15 శాతం మించి మంత్రులుండకూడదని రాజ్యాంగ సవరణ చెబుతోంది

## దత్తాత్రేయ, నిర్మల అవుట్ !

**న్యూఢిల్లీ :** కేంద్ర మంత్రివర్గం నుంచి బండారు దత్తాత్రేయకు ఉద్వాసన పలికారు. బీజేపీ అధిష్టానం ఆయనకు గవర్నర్ పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. ఆదివారం కేంద్ర కేబినేట్ పునర్వ్యవస్థీకరణకు ముహూర్తం ఖరారు కావడంతో కొంతమంది కేంద్రమంత్రులతో బీజేపీ అధిష్టానం రాజీనామా చేయించింది. అందులో బండారు. దత్తాత్రేయ కూడా ఉన్నారు. గవర్నర్ పదవి ఇస్తామని అధిష్టానం తనకు హామీ ఇచ్చినట్టు స్వయంగా దత్తాత్రేయే చెప్పుకుంటున్నారు. 8 మంది కేంద్రమంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. జరిగిన పలు పరిణామాలను చూస్తే.. 8 మందికంటే ఎక్కువమందికి ఉద్వాసన పలికే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీని కేంద్రమంత్రులు కలిసి తమ రాజీనామాలు అందజేశారు. తెలుగు రాష్ట్రాల మంత్రులు నిర్మలా సీతారామన్, బండారు దత్తాత్రేయ తమ రాజీనామా లేఖలను ప్రధానికి అందజేశారు. నిర్మలా సీతారామన్‌ను పార్టీకి మీడియా తరపున చీఫ్‌గా నియమించాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలిసింది. కొత్త మంత్రివర్గం 2019 ఎన్నికల కేబినేట్‌గానే ఉండబోతోంది.

## 3-7 తేదీల్లో చైనా, మయన్మార్‌లకు మోడీ



**న్యూఢిల్లీ:** ప్రధాని మోడీ సెప్టెంబరు 3 నుంచి 5 వరకు చైనాలో పర్యటించనున్నారు. చైనాలో ఫుజియాన్‌లోని గ్జియాన్ వేదికగా 9వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనుంది .ఈ సందర్భంగా శిఖరాగ్ర సమావేశానికియ హాజరవ్వాలని ఆ దేశ అధ్యక్షుడు మోడీని ఆహ్వానించారు. ఈ పర్యటన అనంతరం మయన్మార్ అధ్యక్షుడు హతిన్ క్యా ఆహ్వానం మేరకు 5 నుంచి 7 వరకు ప్రధాని ఆ దేశంలోనూ పర్యటించనున్నారు. మయన్మార్‌లో మోడీ ద్వైపాక్షిక దౌత్య పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. పర్యటన సందర్భంగా హతిన్ క్యా, అంగ్‌సాన్ సూకీలతో మోడీ ఇరుదేశాలకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం. రాజధాని నగరం నేపిటాతోపాటు యంగోన్, బంగాన్ నగరాల్లో కూడా ఆయన పర్యటించనున్నారు.

## పరిశీలన తరువాతే గోప్యత పై తీర్పు

**ఆధార్‌పైఅభ్యర్థన విచారణ**

**సుప్రీంకోర్టు వెల్లడి**



**న్యూఢిల్లీ:** గోప్యత ప్రాథమిక హక్కుగా నిర్ధారిస్తూ సుప్రీంకోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తిల రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన కీలక తీర్పును ముందుగా పరిశీలన జరపాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. దీని తరువాతనే ఆధార్ చట్టాన్ని సవరించేందుకుగాను దాన్ని ద్రవ్యబిల్లుగా ధృవీకస్తూ లోక్‌సభ స్పీకరు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ దాఖలు చేసిన అభ్యర్థనను విచారణకు స్వీకరిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ పీసీ పంత్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూఏడిన ధర్మాసనం పేర్కొంది. తీర్పును తాము కూడా పరిశీలించాల్సివుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా అన్నారు. దాఖలు చేసిన అభ్యర్దన విషయాన్ని సెప్టెంబరు ఒకటి ( శుక్రవారం) ప్రస్తావించాల్సిందిగా పిటిషనరు తరపు న్యాయవాదిని ఆయన ఆదేశించారు. లోక్‌సభ స్పీకరు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరిలో జైరాం రమేష్ ఒక పిటిషను దాఖలు చేశారు. నాటి విచారణ సందర్భంగా జైరాం రమేష్ వాదనలతో తాత్కాలికంగా సమ్మతించడం లేదని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రాధాన్యత, సున్నితత్వాలతో ముడిపడిన ఈ అంశంపై తాము తొందరపడ జాలమని తెలిపింది. దీనిపై కేంద్రం లేవనెత్తిన అన్ని రకాల అభ్యంతరాలనూ పరిగణనలోకి తీసుకుని కేసును సిద్ధం చేయాలంటూ రమేష్ తరపు న్యాయవాదికి సూచించింది. రాజ్యసభ గండాన్ని దాటుకునేందుకుగాను ఆధార్( టార్గెటెడ్ డెలివరీ ఆఫ్ ఫైనాన్షియల్ అండ్ అదర్ సబ్సిడీస్, బెనిఫిట్స్, అండ్ సర్వీసెస్) బిల్లు, 2016ను ద్రవ్యబిల్లుగా ధృవీకరించారనీ ఇలాంటి ధృవీకరణ పొందిన బిల్లుకు ఎలాంటి చట్టబద్ధత లేదంటూ తన పిటిషన్లో జైరాం రమేష్ పేర్కొన్నారు. ద్రవ్యబిల్లుగా లోక్‌సభలో గత సంవత్సరం మార్చి 11న ఆమోదం పొందిింది. మార్చి 16న అనేక సవరణల అనంతరం రాజ్యసభ ఆమోదాన్ని పొందింది. అదే రోజు సాయంత్రం తిరిగి లోక్‌సభలో బిల్లును ప్రదేశ పెట్టారు. రాజ్యసభ ఆమోదించిన అన్ని లోక్‌సభ అమోద ముద్ర వేయడంతో అది చట్టంగా అమల్లోకి వచ్చిందని కోర్టుకు జైరాం వివరించారు. ఈ చట్టం చెల్లుబాటును ఆయన ప్రశ్నిస్తున్నారు.

### నదులను కాపాడుకుందాం : చిరంజీవి పిలుపు



**హైదరాబాద్ :** నదులు ఎన్నో తరాలుగా మనల్ని పోషిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి అన్నారు. నదులు ఇంకిపోతున్నాయని, ఎండిపోతున్నాయని, నదులను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. అలా చేయని పక్షంలో భవిష్యత్ తరాలకు మంచి నీరు కూడా దొరకని పరిస్థితి దాపురిస్తుందని అభిప్రాయపడ్డారు. నదులను కాపాడేందుకు ర్యాలీ ఫర్ రివర్స్ కు మద్దతు ఇద్దామని ఈ సందర్భంగా చిరంజీవి పిలుపు నిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోలో ఆయన మాట్లాడుతూ, 'మన నదులను మనమే కాపాడుకుందాం. అందుకోసం, 'ర్యాలీ ఫర్ రివర్స్' తో చేతులు కలపండి. 8000980009కు మిస్డ్ కాల్ నేను ఇచ్చాను. అలాగే, మీరూ ఇవ్వండి. రండి, మన నదులను మనమే కాపాడుకుందాం' అని అన్నారు.

### అంగన్‌వాడీ చిన్నారులకు టాబ్‌లు

**ఒంగోలు:** అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ తరహా విద్య అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా చిన్నారులు సులువుగా విద్య నేర్చుకునేందుకు టాబ్‌లు ఇవ్వనున్నామని మంత్రి నారాయణ ఒంగోలులో తెలిపారు. దీనికోసం సీఎం చంద్రబాబు రూ. 50కోట్లు కేటాయించారని చెప్పారు.

## దేశ ప్రథమ పౌరుడికి పౌరసన్మానం



**తిరుపతి :** తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రేణిగుంట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గవర్నర్ నరసింహన్, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి తిరుచానూరుకు చేరుకొని పద్మావతి అమ్మవారిని రాష్ట్రపతి దర్శించుకున్నారు. తిరుపతిలో నూతనంగా నిర్మించిన పద్మావతి మెడికల్ కాలేజి భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి, గవర్నర్ ఆధ్వర్యంలో పౌరసన్మానం నిర్వహించారు. శాలువలతో సత్కరించి సన్మాన పత్రాన్ని అందజేశారు. రాష్ట్రపతి మాట్లాడుతూ రాష్ట్రపతిగా ఎన్నికైనా అనంతరం రెండుసార్లే బయట పర్యటించానని ఒకటి జమ్మూ- కాశ్మీర్‌లో అయితే, రెండవది తిరుపతి అని, ఈ పర్యటన ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంతో మంది మహనీయులు రాజకీయ నాయకులుగా, మేధావులుగా ఎదిగారన్నారు.

## వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పించిన జగన్




**ఇడుపులపాయ :** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు నివాళులర్పించారు. కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్‌ఆర్ ఘాట్ వద్దకు ఈ రోజు ఉదయం జగన్, ఆయన తల్లి విజయమ్మ, భార్య భారతి, సోదరి షర్మిల, బ్రదర్ అనిల్ కుమార్, వైఎస్ సోదరుడు వివేకానందరెడ్డి వెళ్లారు. వైఎస్ సమాధి వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వైఎస్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కాగా, ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఓ ట్వీట్ చేశారు. 'వైఎస్‌ఆర్ బతికే ఉన్నారు. ఎందుకంటే, ఎందరో జీవితాలను ఆయన మెరుగుపరిచారు... వైఎస్ ఆర్ బతికే ఉన్నారు..ఎందుకంటే, మన హృదయాల్లో ఆయన ఉన్నారు కాబట్టి' అని పేర్కొన్నారు.

**రాయపూడి లో ' రాజన్న'కు ఘననివాళి**


**రాయపూడి :** రాజధాని ప్రాంతం, మండలకేంద్రమైన రాయపూడి గ్రామంలో దివంగత

- మిగతా 2 లో

## గ్రీన్ సాలిడర్స్ ఆహ్వానం



గ్రీన్ సాలిడర్స్ ఆధ్వర్యంలో అమరావతి రాజధాని నిర్మాణం, పర్యావరణ అంశంపై సెప్టెంబరు 7, ఉదయం 10 గంటలకు విజయవాడ గాంధీ నగర్‌లోని రోటరీ ఆడిటోరియంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు పండలనేని శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ముఖ్యప్రసంగం చేస్తారన్నారు. అమరావతి, పర్యావరణ ప్రేమికులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పండలనేని కోరారు.




# ఆదమరిస్తే దగా.. కానరాని నిఘా..

**రా.వాప్రతినిధి, విజయవాడ :**

- ఏడాదిగా అమల్లోకిరాని 'ఈ-నేత్ర'
- అవసరం 3వేల నిఘా కెమేరాలు..ఉన్నది 1,200




విజయవాడలోని ఓ కార్ఖానాలో అంతర్రాష్ట్ర దోపిడీముఠా చొరబడి బంగారం ఎత్తుకెళ్లకేసులో దోపిడీ దొంగలు బెజవాడలోకి వచ్చిన మార్గం, పరారయిన మార్గాల్లో చాలాచోట్ల సీసీ కెమెరాలు లేవు. ఉన్న దగ్గరా పుటేజీ దృశ్యాలు సరిగా నమోదు కాకపోవడం పోలీసుల పనిని జటిలం చేసింది. అయినా పోలీసులు ఆకేసులోని చాలా మందిని పట్టుకున్న విషయం తెలిసిందే. నిజానికి, రాజధాని ప్రకటనతో.. తరలివస్తున్న, అందివస్తున్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకొని శరవేగంగా బెజవాడ విస్తరిస్తోంది. నగర నడిబొడ్డు నుంచి శివార్ల దాకా భారీ నిర్మాణాలు, హోటళ్లు, వెంచర్లతో కిటకిటలాడిపోతున్నాయి. అదేసమయంలో దోపిడీ ముఠాలూ, అంతర్రాష్ట్ర దొంగలూ సిటీపై కన్నేశారు. హైదరాబాద్ మీదుగా విజయవాడకు తేలిగ్గా చేరుకొంటూ, ఈజీ టార్గెట్‌లపై దాడులకు పొంచి ఉన్నారు. ఇలాంటి సమయంలో నగర భద్రత పడకేయడం ఆందోళన కలిగిస్తోంది. నగరాన్ని రేయింబవళ్లు కనిపెట్టి ఉంచాలంటే దాదాపుగా మూడు వేలకు పైగా సీసీ కెమెరాలు అవసరమని పోలీసుశాఖ అంచనా. కానీ, అన్నీ కలిపి 1200 సీసీలు కూడా లేవు.

వీటిలో 135 కెమెరాలకు మాత్రమే పీటీజడ్ సౌకర్యం ఉంది. అంటే, 360 డిగ్రీల కోణంలో ఆయా ప్రాంతాల్లో జరిగే సన్నివేశాలను చిత్రీకరించగల సామర్థ్యం అన్నమాట. ఈ సీసీల్లో ఎంతలేదన్నా.. రోజుకు 150 నుంచి 200 కెమెరాల కన్ను పనిచేయదు. ఇక.. ప్రజాభద్రత చట్టం కింద వాణిజ్య సముదాయాలు, వన్‌టౌన్, బీసెంట్ రోడ్డు మార్కెట్లలో వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభు త్వం తాజాగా 750 కెమెరాలను అందించింది. మహాత్మాగాంధీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీసీ)ని ఆధునీకరించింది. ఆ స్థాయిలో సీసీ వ్యవస్థని మెరుగుపరిచే చర్యలు ఎక్కడా కనిపించడం లేదు.

సిసి కెమెరాల ప్రాజెక్టులో ప్రజలను భాగస్వామ్యం చేయాలనుకున్నారు విజయవాడ పోలీసులు. 'ఈ నేత్ర' పేరుతో ఏడాది క్రితం ఒక ప్రాజెక్టును రూపొందించారు. దీనికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ప్రాజెక్టు అనుకొన్న సమయంలోనే పుష్కరాలు రావడంతో, పనులు పక్కకు పడిపోయాయి. నిజానికి, ప్రధాన రహదారులను ఎంతోకొంత సీసీలు కాపు కాస్తాయి. చీకటి నిండిన మారుమూల ప్రాంతాలు, గల్లీల విషయంలోనే నిఘా నేత్రం పదునెక్కాల్సిన అవసరం ఉంది. ఈ అవసరంలోంచి 'ఈ నేత్ర' రూపుదిద్దుకొంది. బంగారం దోపిడీ ఘటన తరువాత.. మళ్లీ ఇన్నాళ్లకు ఈ దిశగా పోలీసుల్లో కదలిక వచ్చింది.

**నిర్వహణ మాటేమిటి?**

సీసీ కెమెరాల ఏర్పాటు ఒక ఎత్తయుతే, వాటి నిర్వహణ మరో ఎత్తు. మహాత్మాగాంధీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సీసీలను అనుసంధానించడం బాగుంది. అయితే, వాటి నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించడమే చిక్కులు తెస్తోంది. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారిని పోలీసస్టేషన్‌లవారీగా ఎంపిక చేసి, మొత్తం పది మందితో ఈ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నది అధికారుల ఆలోచన. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని విజయవాడ పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్ తెలిపారు.



## రాజధాని వార్తలు

కలం

# ప్రజాస్వామ్య పరాజయం


నంద్యాలలో ఇరు పక్షాలు హోరాహోరా తలపడ్డాయి. ముఖ్యమంత్రి మూడు దఫాలుగా 6 రోజులు ఎన్నికల ప్రచారం చేయగా, ప్రతిపక్షనేత 12 రోజుల పాటు అక్కడే ఉండి ఇంటింటికీ ప్రచారం చేశారు. జనం తండోపతండాలుగా వచ్చారు. వైసీపీదే విజయం అనుకున్నారు. అయితే అలా జరగలేదు. ఓటర్లను ఇరుపార్టీ వర్గాలు ప్రలోభాలకు గురిచేశారు. అధికార పార్టీకి ఈ విషయంలో మరింత విస్తృత అవకాశాలు ఉండటంతో దాన్ని సద్వినియోగం చేసుకున్నారు. దానికి తోడు ఆడకూతుర్లు అనాధలమంటూ ఓట్లు అడిగితే కాదనేది ఎవరు ? నిజానికి ప్రతిపక్షం పోటీ పెట్టకూడదు. అయితే తమ పార్టీనుంచి గెలిచి అధికార పక్షంలోకి ఫిరాయించారన్న కారణంతో పోటీ చేస్తున్నామని ప్రతిపక్షం స్పష్టం చేసింది. ఇది కూడా నిజమేకదా .. దేశం మొత్తంలోనే అతి ఖరీదైన ఈ ఎన్నికల్లో అధికార పక్షం దాదాపు 30 వేల మెజార్టీతో విజయం సాధించింది.

ఎన్నికలను ప్రకటించకముందే నంద్యాలపై ముఖ్యమంత్రి దృష్టిపెట్టారు. రోడ్లవిస్తరణ పనులు, నిరుద్యోగ భృతి అంటూ ఆశలు రేపారు. రూ.1400 కోట్లను అప్పటికప్పుడు విడుదల చేశారు. డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ మూడోవిడత రూ. 4000 బ్యాంకుల్లో జమచేశారు. రాష్ట్రంలో మరెక్కడా దీన్ని అమలు చేయలేదు. సర్వేబృందాలతోనే అసలు రాజకీయమంతా నడిచిందని చెప్పవచ్చు. అందరూ ఎంతమంది ఓటర్లు ఉన్నారు ? ఏం చేస్తున్నారు ? ఫోన్ నంబర్లను తీసుకొని మరీ వారంతా సమాచారాన్ని స్థానిక నాయకులకు అందించారు. దీంతో వారంతా ఫోన్లో మంతనాలు సాగించి, బేరాలు కుదుర్చుకున్నారు. ఓటుకు రూ.5 వేలు ఇచ్చిపుచ్చుకోవడం జరిగింది. ఇంట్లో ఐదారుగురు ఉంటే రూ.50 వేలు బ్యాంకుల్లో పడిపోయాయి. ఇవే ఘటనలు కాకినాడలోకూడా చోటుచేసుకున్నాయి. స్థానికంగా టీవీ నెట్‌వర్క్ అంతా భూమా కుటుంబానిదే కావడంతో అక్కడ ప్రతిపక్ష ఛానల్ ప్రసారాలు లేవు. నిజానికి ఒక ఉప ఎన్నికకు 80 మంది ఎమ్మెల్యేలు, 10 మంది మంత్రులు, ముఖ్యమంత్రి అన్నిరోజులు ప్రచారాలు జరపనక్కర్లేదు. అయితే కేంద్రంలోని అధికార బీజేపీ ప్రతిపక్షంతో ఎక్కువ ప్రేమగా ఉంటుందన్న కారణంతో ఈఎన్నికలో విజయం సాధించకపోతే విపక్షంతో దాని మైత్రీ బంధం మరింత బలపడుతుందనే గాభరాతోనే ఈ ఎన్నికలను అధికారపార్టీ అత్యంత ప్రతిష్టాత్మంకంగా తీసుకున్నారనడంలో సందేహంలేదు. ఎంత ఖర్చుపెట్టయినా గెలవాలనే తలంపుతో అందరూ శ్రమపడ్డారు. వైసీపీ అధినేత జగన్ దూకుడూ, ఆపార్టీ సభ్యురాలు రోజా అతివాగుడూ ప్రజల్లో కలవరం పుట్టించాయి. మంత్రులంతా శక్తికొలది ఎన్నికల నిబంధనలను, రాజ్యాంగ పరిధిని దాటారు. ముఖ్యమంత్రి కులాలవారీగా ఆత్మీయ సదస్సులు జరిపి వారికి నోట్లను అందించడం, మంత్రి గంటా ఉపాధ్యాయ, ఉద్యోగ నేతలతో సమీక్షలు జరపడం ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహం. చదువుకున్నామనే ఇంగితం లేకుండా ఉద్యోగనేతలు ఇంతగా దిగజారడం అంతకు ముందెన్నడూ లేదు. సమైక్యాంధ్ర ఉద్యమం తర్వాత ఉద్యోగనాయకుడిగా చక్రం తిప్పుతున్న వ్యక్తి ఉద్యోగుల హక్కుల కోసం కాకుండా అధికారపార్టీ రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించి ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తున్నారు.

కాకినాడలో ఓటర్లు ఎంతకావాలంటే అంత ఇచ్చి పార్టీని గెలిపించాలంటూ చంద్రబాబు ఆదేశించారని తెలుస్తోంది. అయితే ఓటుకు నోటు పుచ్చుకున్న ఓటర్లు రోడ్డువిస్తరణ పనులు చేయలేదనో మరే పనిమీదనో వెళ్లి పాలకులను ఓటర్లు నిలదీయగలరా ? ఏది ఏమైనా ప్రజలు ఓటు విలువ తెలుసుకోవాలి. పాలకుల ప్రలోభాలకు గురిచేయకుండా ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. నంద్యాలతో పాటు గోవా, ఢిల్లీలో కూడా అధికార బీజేపీ గెలిచింది. అయితే గోవా రెండు నియోజకవార్గాల్లో ఒకచోట మాజీ రక్షణ మంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ విజయం సాధించగా, కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన విశ్వజిత్ రాణె కాంగ్రెస్‌కు రాజీనామా చేసి మళ్లీ పోటీచేసి విజయం సాధించారు. ఆప్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఢిల్లీ ఎమ్మెల్యే ఓడిపోగా నూతన అభ్యర్థిని నిలబెట్టిన ఆప్ అత్యంత మెజారిటీ సాధించింది. అంతకముందు కర్ణాటకాలో జరిగిన రెండు చోట్ల కూడా అధికార పార్టీ కాంగ్రెస్ విజయం సాధించింది. అయితే మనరాష్ట్రంలో పరిస్థితి వేరు ఫిరాయింపులకు పాల్పడినవారు పార్టీకి రాజీనామా చేయకుండానే పోటీలో గెలవడం ఇంతవరకు ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలో జరగలేదు. వామపక్షాలు పేర్కొన్నట్టు ఈ ఎలక్షన్‌ను ఆక్షన్ (ఎన్నికను వేలంపాట) గా మార్చారు. ఈ ఖర్చుతో రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. ఏది ఏమైనా ప్రజాస్వామ్యం పరాజయం అయింది. ఓటర్లు ఎప్పుడైతే ఓటు విలువ తెలుసుకుంటారో అప్పుడే ప్రజాస్వామ్యం ప్రగతిబాట పరుస్తుంది.

పౌరులు–చట్టాలు

# రాజ్యాంగంలో మైనార్టీ హక్కులు






కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
కన్సల్టింగ్ ఎడిటర్, హైకోర్టు న్యాయవాది
98495 68901/83309 68901
katuruRavindraTrivikram@gmail.com


26 మనది భిన్న,భాషా సంస్కృతులు గల దేశం. ఒకప్పుడు 56–దేశాల సమాహారంగా మాహాభారత దేశం వర్ధిల్లింది. అంటే దాదాపు ప్రపంచమంతా భారతదేశంగా,భారతపాలకులే చక్రవర్తులుగా ఉండేవారు. చారిత్రక కారణాల వల్ల ఇప్పుడు మనం చూస్తున్న దేశంగా సరిహద్దుల మధ్య పరిమితమైపోయింది. ఒకనాటి దేశాలు ఇప్పుడు రాష్ట్రాలు ప్రాంతీయ భాషలు, సంస్థ తల మీద విదేశీపాలకుల ప్రభావంపడినా మూలాలు అలాగే నిలిచి ఉన్నాయి. అందువల్ల నవభారతంలో భారతరాజ్యాంగం వీటి రక్షణను పరిగణనలోకి తీసుకుంది.సంస్కృతి, విద్యాహక్కులు (అధికరణం 29 ,30)

1.మైనార్టీల హక్కుల రక్షణ :(29 వ అధికరణం) : తక్కువ సంఖ్యలో గలవారే మైనార్టీలు మత, జాతి, బాష,సంస్కృతి పరంగా వీరిని రక్షించాల్సిన బాధ్యతను రాజ్యాంగం స్వీకరించింది. వీరి పట్ల విచక్షణ ఈ అధికరణం నిరోధిస్తుంది. వారి హక్కులను కాపాడుతుంది. వారికి విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఎలాంటి విచక్షణ చూపకూడదు. ప్రధానంగా రెండు హక్కులు ఈఅధికరణం ప్రసాదిస్తుంది.

(ఎ) భారతదేశ సరిహద్దుల్లో నివసించే ఏ పౌరసమాజమైనా, తమకు గల ప్రత్యేక భాష, లిపి, సంస్కృతులను ఉపయోగించుకునే, అభివృద్ధి పరచుకునే హక్కును కలిగి ఉంటారు.

ఇది మతం వరకే పరిమితం కావు. భాషకి సంబంధించిన అల్ప సంఖ్యాక వర్గాలకూ వర్తిస్తుంది.

బి) ప్రభుత్వ నిధులతో లేక నిధుల మద్దతుతో పనిచేస్తున్న ఏ విద్యా సంస్థల్లో –జాతి, కుల, మత,భాష విచక్షణ కారణంగా ప్రవేశానికి ఎవర్ని నిరాకరించకూడదు. అయితే15(4) అధికరణం ప్రభుత్వానికి షెడ్యూల్ కులాలు, తరగతుల వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడానికి వీలు కల్పిస్తుంది.

మైనార్టీల విద్యా సంస్థల ఏర్పాటు, నిర్వహణకుల హక్కు :అధికరణం 30 మైనార్టీలు విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకోవడానికి, నిర్వహించడానికి హక్కు కల్పిస్తోంది. ఇది ఒక విధంగా 29వ అధికరణంలోకి కొనసాగింపు. దీని ప్రకారం

1. మైనార్టీలందరూ (మతం లేక భాషప్రాతిపదికంగా) వారి అభీష్ట ప్రకారం విద్యాసంస్థల్ని నెలకొల్పి నిర్వహించే హక్కు కలిగి ఉన్నారు. అయితే, ప్రభుత్వానికి విద్యా ప్రమాణాలు, క్రమబద్ధీకరణ, తత్సంబంధ అంశాలమీద అధికారం ఉంటుంది. క్రమబద్ధీకరణ నిబంధనలు– ప్రతిభ,బోధన,క్రమశిక్షణ,ఆరోగ్యం, పరిశ్రుభ్రత, నైతికత, ప్రజల శాంతిభద్రతలకు సంబంధించినవై ఉంటాయి. అయితే, విద్యాసంస్థలకు ప్రత్యేక ప్రవేశకార్యక్రమం ఉండొచ్చు. దానిని నియంత్రించే హక్కు ప్రభుత్వానికి లేదు. అది వారి వ్యవహారాలలో తలదూర్చటం అవుతుంది.

మత సంస్థలచే నెలకొల్పబడిన విద్యాసంస్థల తమవారికి ప్రత్యేకత చూపినా, ప్రభుత్వ సహాయం పొందుతున్న కారణంగా ఇతర వర్గాలకు కూడా అవకాశం కల్పించాలి.

మైనార్టీ సంస్థల ఆస్థుల స్వాధీనం : ప్రభుత్వం ఏదైనా ప్రత్యేక చట్టం ద్వారా మైనార్టీ సంస్థల ఆస్తుల స్వాధీనం చేసుకునే సందర్భంలో,చెల్లించే ఆహారం,30(1) అధికరణహక్కులకు భంగం కలిగించకూడదు.

2) ప్రభుత్వం మైనార్టీ సంస్థలనే కారణం మీద నిధులకు ఇవ్వడంలో విచక్షణ చూపరాదు.

(సశేషం)

# ఉపాధ్యాయ దినోత్సవంగా సర్వేపల్లి జన్మదినం



మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం ప్రతి సంవత్సరం జరుపుకుంటాము. పాఠశాలలు యధావిధిగా జరిగి, ఉత్సవాలు జరుపుకుంటాము. ఉపాధ్యాయులకు జాతీయ, రాష్ట్రీయ,జిల్లా స్థాయిలలో పురస్కారాలు, గౌరవసత్కారాలు జరుగుతాయి. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం అక్టోబరు 5 వ తేదీన జరుపుకుంటారు. ఒమన్, సిరియా, ఈజిప్టు, లిబియా, కతార్, బహ్రాయిన్, యు.ఏ.ఇ., యెమన్, ట్యునీషియా, జోర్డాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, మొరాకో దేశాలలో ఫిబ్రవరి 28న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ (సెప్టెంబర్ 5, 1888మరణం ఏప్రిల్ 17, 1975) భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి కూడా. అంతేకాదు భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారు. రెండు సార్లు ఉపరాష్ట్రపతి పదవి ఆపై రాష్ట్రపతిగా పదవిని చేపట్టి, దేశ క్లిష్టకాలంలో (చైనా, పాకిస్తానులతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు.

**విద్యాభ్యాసం**

సర్వేపల్లి రాధాకృష్ణన్ 5–9–1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వీరాస్వామి ఒక జమీందారీలో తహసిల్దార్. వారి మాతృభాష తెలుగు. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగుచోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందాడు. బాల్యం నుండి అసాధారణమైన తెలివితేటలు కలవాడాయాన. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహము జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.

**జీవిత విశేషాలు**

రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న చెన్నై దగ్గరి తిరుత్తణి అనే వూరిలో జన్మించారు. అక్కడే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. వీళ్లది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారిగా చేయమన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ ఈయన చదువంతా ఉపకారవేతనాలతోనే సాగిపోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో ఆయన నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

**ఉద్యోగం**

21 సంవత్సరాలైనా దాటని వయసులో ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యాడు. తత్వశాస్త్రంలో అతని ప్రతిభను విని మైసూరు విశ్వవిద్యాలయం అతనిని ప్రొఫెసర్‌గా నియమించింది. ఆయన ఉపన్యాసాలను ఎంతో శ్రద్ధగా వినేవారు విద్యార్థులు. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవి చేపట్టమని, డా.అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ టాగూర్‌లు కోరారు. దాంతో ఆయన కలకత్తా వెళ్ళాడు. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా వున్నప్పుడు ఆయన 'భారతీయ తత్వశాస్త్రం' అన్న గ్రంథం వ్రాశాడు. ఆ గ్రంథం విదేశీ పండితుల ప్రశంసలందుకున్నది. 1931లో డా. సి.ఆర్.రెడ్డి గారి తర్వాత రాధాకృష్ణన్ గారు ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్‌గా పనిచేశారు. ప్రధాని నెహ్రూ కోరిక మేరకు 1952–62 వరకు భారత ఉపరాష్ట్రపతిగా పనిచేశారు. 1962లో సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత రాష్ట్రపతి అయిన తరువాత కొందరు శిష్యులు మరియు మిత్రులు, పుట్టిన రోజు జరపటానికి అతనివద్దకు వచ్చినప్పుడు, "నా పుట్టిన రోజును వేరుగా జరిపే బదులు, దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే నేను ఎంతో గర్విస్తాను", అని చెప్పి ఉపాధ్యాయ వృత్తి పట్ల తన ప్రేమను చాటారు. అప్పటినుండి ఆయన పుట్టిన రోజును భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

బోధకుడిగా పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. ఆయన రోజులో 12 గంటలపాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవారు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాసేవారు. రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పదవులు చేపట్టడమే కాదు, ఆంధ్రా యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి (వైస్‌ఛాన్స్‌లర్) గా పనిచేశారు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు.

ఆయన రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించారు. 'యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్'లో సభ్యుడిగా ఉండి మన విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు రాధాకృష్ణన్.

1952లో మన మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. 1954లో భారతరత్న పురస్కారం దక్కింది. ఏనాడూ ఆడంబరాలకు పోలేదు.

రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగిచ్చేవారు.

రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. ఆయన మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్లేప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును కూర్చోబెట్టి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్లారట.

## వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పించిన జగన్

(మొదటిపేజీ తరువాయి)

డా॥ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 8 వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో వైఎస్‌ఆర్ పార్టీ నాయకులు కత్తేర సురేష్ కుమార్ వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తుళ్ళూరు మండల కమిటి అధ్యక్షుడు బత్తుల కిశోర్ రాయపూడి కమిటి సభ్యులు కె. శ్రీనివాసరావు శివయ్య మాహాలక్షిరావు గుర్నునాధం పులా ప్రభాకరావు, రమేష్ పాల్గొన్నారు. అనంతరం 200మంది అన్నదానం ఏర్పాటుచేశారు.







## వినాయకుడి లడ్డు రూ.72 వేలు

**రా.వా.ప్రతినిధి, రాయపూడి :** వినాయకుడు లడ్డు రూ.72వేలు పలికింది. మండల పరిధిలోని రాయపూడిలో వినాయక ఉత్సవాన్ని పురస్కరించుకొని ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా 11 కిలోల లడ్డును వేలం నిర్వహించగా 72 వేలు ధర పలికింది. గ్రామానికి చెందినది మలి శెట్టి యుగంధర్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమం అనంతరం గ్రామంలో గణేష్‌ను ఊరేగించి నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి తంలించే ముందు గణపతి లడ్డు వేలం నిర్వహించారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు హారతులు ఇచ్చి గణాధుని విగ్రహాలకు దారి పొడవునా పూజలు నిర్వహించారు. మేళతాళాల నడుమయువత పెద్ద ఎత్తున సందడితో గ్రామంలో కోలాహలం నెలకొంది.

# హాసిని.. మరో శకుంతలాదేవి

**హ్యూమన్ కంప్యూటర్, గణిత శాస్త్రవేత్తగా పేరుగాంచిన శకుంతలాదేవిని గుర్తు చేస్తోంది విజయవాడకు చెందిన హాసిని.**



ఆమె వమస్సు ఏడేళ్లే కాని 194 దేశాలకు సంబంధించిన రాజధానుల పేర్లను సెకన్లలో చేప్పేస్తుంది. మనదేశంలో రాష్ట్రాల పేర్లు, వాటి రాజధానుల వివరాలు చెబుతుంది. దేశ ప్రధానులు, అధ్యక్షులు, మనరాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్, మంత్రులు, జిల్లాలు, జిల్లా కేంద్రాల గురించి తడముకోకుండా వివరిస్తుంది.

అంతేనా.... ఎంతోమంది పెద్దవాళ్ళకు మింగుడుపడని, నచ్చని సబ్జక్ట్ గణితంతోనూ హాసిని ఆరితేరింది. రెండకల, మూడంకెల సంఖ్యలకు గుణించి సమాధానలను సెకన్లలో చెప్పేయగల సత్తా తనకుందని నిరూపించుకుంది. స్క్వేర్స్‌ను 150, స్క్వేర్ రూట్స్‌ను 3 లక్షల వరకు చేసేయగల శకుంతలాదేవిని గుర్తు చేస్తోంది. క్యాలెండర్‌ను 1901–2100 ఏళ్ల వరకు ఎప్పుడు ఏ రోజు, ఏ తేదీ వస్తుందో ఎలాంటి తడబాటు లేకుండా చెబుతుంది. పిరియాడిక్ టేబుల్‌లో 118 కణాల గురించి, వాటి సూత్రాలను నిమిషాల్లో వివరించేస్తుంది. మరి ఏడేళ్ళ వయస్సులో ఇన్ని చేయడం నిజంగా గ్రేట్ కదా! ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కాబట్టే పలువురి మన్ననలు పొందింది పోలీసు ఉన్నతాధికారులకు ఎంతో ప్రతిష్టాత్మకమైన మూడు సింహాల ప్రతిమను అందుకుంది. హాసిని ప్రతిభను స్వయంగా చూసిన విజయవాడ నగర సీపీ బి.వి రమణమార్ ఆ పాపకు శాలువా కప్పి ఈ మూడు సింహాల ప్రతిమను అందజేశారు. ఇటీవల విజయవాడ నగరంలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో విలేకరుల సమక్షంలోనూ తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించింది. హాసిని, తండ్రి ఉమాశంకర్ పోలీసు విభాగంలోపనిచేస్తుండడంతో నగర సీపీ గౌతం సవాంగ్ ఆదేశాల మేరకు ఈ అభినందన సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ సీపీ బీవీ రమణకుమార్ స్వయంగా కొన్ని ప్రశ్నలు అడిగారు. వాటికి హాసిని ఇచ్చే సమాధానాలు విని మంత్రముగ్ధులయ్యారు. నేటి విద్యార్థులతో పాటు ఎంతోమంది ప్రతిభాపాటవాలు ఉన్నవారు. కూడా ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్ వంటివి లేకపోతే కొన్ని సమాధానాలను చెప్పలేకపోతున్నారని కానీ, ఈ పాప అడిగిన ప్రతిప్రశ్నకు సెకన్లలో చేతివేళ్లపై లెక్కపెట్టి టక్కున సమాధానాలను చెప్పడం అభినందనీయమని రమణకుమార్ మెచ్చుకున్నారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవడంతో పాటు నిష్ణాత్తులతో వారితో శిక్షణ ఇప్పించి పాపను మరింతగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. నోబెల్ బహుమతి వంటి ఉన్నతమైన పురస్కాలను అందుకోవాలని ఆకాంక్షించారు. పోలీసు కుటుంబానికి చెందిన పాపకు అవసరమైన సహా సహకారాలను తమ శాఖ నుండి అందించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మున్నంగి ఉమాశంకర్, జ్యోతి...హాసిని తల్లిదండ్రులు, విజయవాడ నగరంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో 2వ తరగతి చదువుతోంది. హాసిని తండ్రి ఉమాశంకర్ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి జ్యోతి హోమ్‌మేకర్, హాసిని అన్న మురళీధర్ ఏడవ తరగతి చదువుతున్నాడు. అద్భుతమైన జ్ఞాపకశక్తిని ప్రదర్శిస్తున్న హాసిని ముందుముందు మరింత ప్రతిభను సొంతం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నారు నగరవాసులు.

# బాల మేధావి ధృవ్ గార్గ్

## ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌లను మించిన ఐక్యూ

**భారత సంతతికి చెందిన 13 ఏళ్ల ధృవ్‌గార్గ్ మెన్సా నిర్వహించిన ఐక్యూ పరీక్షలో 162 మార్కులు సాధించాడు. విఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ ఐన్‌స్టీన్, బ్రిటన్ గణిత-భౌతిక శాస్త్రవేత్త డా.స్టీఫెన్ హాకింగ్‌ల(అంచనా) ఐక్యూ 160 కన్నా ఈ బాల మేధావి రెండు మార్కులు ఎక్కువ సాధించి ప్రపంచాన్ని అబ్బురపరిచాడు**





**లండన్ :** ప్రజ్ఞాపాటవ (ఐక్యూ) పరీక్షల గురించి పరిచయం ఉన్న వారికి బ్రిటీష్ మెన్సా ఐక్యూ పరీక్ష గురించి వేరుగా చెప్పనవసరం లేదు. ప్రపంచ స్థాయిలో ఇదే అత్యుత్తమ ఐక్యూ వేదికగా పరిగణన పొందుతోంది. అంతటి ప్రఖ్యాత వేదిక మీద 13 సంవత్సరాల భారత సంతతి బాలుడు ధృవ్‌గార్గ్ స్థానం సంపాదించాడు. మెన్సా నిర్వహించిన ఐక్యూ పరీక్షలో ధృవ్ గార్గ్ 162 మార్కులు సాధించాడు. విఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ ఐన్‌స్టీన్ , బ్రిటన్ గణిత–భౌతిక శాస్త్రవేత్త డా.స్టీఫెన్ హాకింగ్‌ల(అంచనా) ఐక్యూ 160 కన్నా ఈ బాల మేధావి రెండు మార్కులు ఎక్కువ సాధించడం విశేషం మెన్సా నిర్వహించే రెండవ పరీక్ష–కల్చర్ ఫెయిర్ స్కేల్–లోనూ 152 మార్కులు సాధించిన ధృవ్... ప్రపంచం మొత్తంలో ఒకే ఒక శాతంగా ఉన్న మేధావుల సరసన నిలిచేందుకు అర్హత సాధించాడు. ఆగ్నేయ ఇంగ్లాండ్‌లోని వోకింహామ్‌కు చెందిన ఈ పాఠశాల విద్యార్థి ఏదేని అరుదైన ఘనత సాధించాలని కలలు కంటూండేవాడు. ఈ కలలు సాకారం చేసుకునేందుకు తగిన కఠోర శ్రమకూ వెరవ లేదు. ఫలితమే మెన్సా ఐక్యూ పరీక్షలో సాధ్యమైనన్ని ఎక్కువ మార్కులు సాధించడంటం ద్వారా బాలమేధావిగా నిలవడానికి కారణమైందని డైలీ మిర్రర్ పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. వేసవి సెలవుల్లో ఏదైనా వినూత్నతను సాధించాలనే లక్ష్యంతో పరీక్షకు హాజరైనట్లు గార్గ్ తెలిపాడు. అయితే ఇంత గొప్పగా మార్కులు వస్తాయని తాను ఊహించలేదన్నాడు. ఇందుకు చాలా ఆనందిస్తున్నానన్నాడు. బెర్క్‌షైర్‌లోని రీడింగ్ స్కూల్ విద్యార్థి అయిన ధృవ్ గార్గ్‌లో మరో ప్రత్యేకతా దాగుంది. ఒంటరి బతుకులు బతికే వారి మధ్య సంబంధ బాంధవ్యలు నెలకొల్పడం లక్ష్యంగా ఒక యాప్‌ను అభివృద్ధి చేసే ప్రయత్నంలో గార్గ్ ఉండటం విశేషం. ఒకే ప్రాంతంలో ఉంటూ కొత్త వారితో సంబంధ బాంధవ్యాలను నెలకొల్పుకోవాలనుకునే వారిని ఈ యాప్ అనుసంధానిస్తుంది. క్రికెట్, టేబుల్ టెన్నీస్ ఆటలన్నా గార్గ్ కు చాలా ఇష్టం. అంతే కాదు. కేవలం 100సెకెండ్లలోనూ రూబిక్ క్యూబ్ పజిల్‌ను పరిష్కరించిన ఘనతా గార్గ్ ఖాతాలో ఉంది. ప్రపంచంలో ఎవరు,ఎక్కడి నుంచైనా ఈ మెన్సా ఐక్యూ పరీక్షలో పాల్గొనవచ్చు.






# ఎవరికీ తలవంచం

పోలీసు ఉద్యోగం పురుషులకే సవాలుగా నిలుస్తుంది. సెలవులు తక్కువ బాధ్యతలు ఎక్కువ.. ఇంట్లో జరిగే చెడు,మంచి కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వీలుకాదు. వారాంతాలు,పండగలకు సెలవులు ఉండవు సరికదా ఆరోజు మరింతగా భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. సమాజంలో ఎటువంటి అసహన, అనుమానాస్పద సంఘటనలు జరిగినా వీరిపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. రాజకీయనాయకులు పర్యటనల్లో భద్రతా చర్యలు చేపట్టడం, ట్రాఫిక్ నియంత్రణలో భాగం పంచుకోవడం, ఎండనకా, వాననకా బాధ్యతలు నిర్వహించడం, రోజుల తరబడి కుంటుంబాలను పట్టించుకోకుండా గడపవలసిన పరిస్థితి ఒక్కపోలీసులకే ఉంటుంది. అదే మహిళా పోలీసు అధికారులకు ఇంటిని, పిల్లలను పట్టించుకోవాల్సిన అవసరం కూడా ఉంటుంది. అయినా ఇంటి, ఉద్యోగబాధ్యతలను సమన్వయం చేసుకునేందుకు వారు ప్రతిక్షణం ఒత్తిడికి గురవుతారన్నది నిజం. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఎంతో పలుకుబడి ఉన్న నేతల నిర్వాకాలను కూడా నిర్భయంగా బయటికి తెచ్చి శెహభాష్ అనిపించుకున్న కర్ణాటక ఐపీఎస్ రూపాయాదవ్, ఉత్తరప్రదేశ్ ఐపీఎస్ అధికారిణి శ్రేష్ఠా ఠాగూర్ గురించి ఈ వారం తెలుసుకుందాం..

ఆమె

కర్ణాటక జైళ్ల డీఐజీగా పనిచేసే రూపాయాదవ్ జైళ్లశాఖ ఉన్నతాధికారులు, రాజకీయ ఖైదీల ఆగడాలపై నిర్భయంగా నివేదికలు ఇచ్చారు. పరప్పణ అగ్రహార జైలులో ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి వి.కె శశికళ రాజభోగాలు అనుభవిస్తున్నారని, ఇందుకోసం ఆమె

## బదిలీ శిక్షకాదు.. ఉద్యోగంలో భాగం..

సీనియర్ అధికారి జైళ్ల శాఖ డీజీపీ హెచ్ ఎన్.సత్యనారాయణ రెండుకోట్ల రూపాయల లంచం తీసుకొని వ్యవహరిస్తున్నారని, ఇందులో భాగంగా శశికళకు ప్రత్యేక వంటగది, ఇతర వీఐపీ సదుపాయాలను కల్పించారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు నివేదిక అందించారు. దీనిపై ఆమె పై అధికారి అగ్రహోదగ్రులైనా ఆమె పట్టించుకోలేదు. పత్రికలకు ఈ విషయాలను పత్రికలకు విడుదల చేయడంతో ప్రభుత్వం రూపాను బదిలీ చేసింది. పంజాబీ డ్రస్‌వేసుకున్న శశికళ, ఆమె మరదలు,సహ ఖైదీ ఇళవరసి ఇద్దరూ షాపింగులకు వెళ్లి తిరిగి వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే.

ఉత్తర ప్రదేశ్‌లోని మరొక అధికారి శ్రేష్ఠా ఠాగూర్ ధైర్యం ప్రదర్శించి ఆదర్శంగా నిలిచారు. కొదిరోజుల క్రిందట వాహనాల పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న జిల్లా స్థాయి బీజేపీ నాయకుడు ప్రమోద్‌లోధికి పోలీసులు ఛలానా రాశారు.దీంతో పోలీసులులతో వాగ్వివాదానికి దిగి, అసభ్యంగా ప్రవర్తించినందుకు ఆయన్ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. దాంతో ఆ నాయకగణం అక్కడికి చేరుకొని శ్రేష్ఠాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి ఆ అధికారి కొంచెంకూడా బెదరలేదు సరికదా.. వారి మధ్యకు చేరుకొని జేబులో చేయిపెట్టి ' వెళ్లండి వెళ్లి సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్నా ఛలానా రాయవద్దని ముఖ్యమంత్రి నుంచి కాగితం రాయించుకురండి, మేము మా కుటుంబాలను, సంతోషాలను ఒదిలి పగలు, రేయి ఉద్యోగాలు చేసేది ఎందుకని నిలదీశారు. ఈ వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే.. నిందితులను వెనుకేసుకొచ్చిన ప్రభుత్వం ఆమెను బదిలీ చేసింది. అంతకుముందు బీజేపీ ఎమ్మెల్యే రాధామోహన్ దాస్ అగర్వాల్ దూషించడంతో చారునిగ అనే ఐపీఎస్ మహిళా అధికారి కంట నీరు పెట్టుకున్న విషయం తెలిసిందే.

## రాజధానిలో జగన్ నివాస భవనాలు

### పార్టీ రాష్ట్ర కార్యాలయం

**రా.వా.ప్రతినిధి, అమరావతి :** రాజధాని ప్రాంతం అమరావతిలో ప్రతిపక్షనేత వైఎస్ జగన్ నివాసం సిద్దమవుతోంది. రాజధానిగా ప్రకటించిన కొద్ది రోజులకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లి కరకట్ట మార్గాన నివాసం ఏర్పాటు చేసుకున్నారు. మంత్రులు సైతం విజయవాడలోనే అతిధి గృహాలు ఏర్పరుచుకుని పాలనలో భాగస్వాములవుతున్నారు. వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం నిర్మించిన నాటి నుంచి హైదరాబాద్‌ను వదలి ప్రభుత్వ యంత్రాంగం అంతా నవ్యాంధ్రలోనే కొలువు దీరారు. ప్రతిపక్ష నేత తెలంగాణ రాష్ట్రంలో ఉండటాన్ని అస్త్రంగా చేసుకుని తెలుగుదేశం పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలలో సైతం జగన్ పార్టీ నేతలకి,ప్రజలకి అందుబాటులో ఉండకుండా హైదరాబాద్, బెంగుళూరులలో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. వారికి ధీటుగా సమాధానం చెప్పాలని భావించిన వైసీపీ నేతలు ప్రభుత్వం కేటాయించే స్థలంపై చర్చించారు. ప్రభుత్వం కేటాయిస్తానన్న స్థలంపై నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో జగన్ నివాసం, పార్టీ కార్యాలయం ఏర్పాటు కోసం శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి నేతృత్వంలో అధ్యయనం చేయగా, దీనికి జగన్ ఆమోదముద్ర వేశారు. రాజధానిలో నివాసం, పార్టీ కార్యాలయం, కార్యకర్తలను కలుసు కునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లతో భవనాలను తీర్చిదిద్దే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సూచనలు, సలహాలు అందించారు.

## హనీప్రీత్‌పై లుక్ ఔట్ నోటీసు



**చండీగఢ్ :** దేరా బాబా దత్తపుత్రిక హనీప్రీత్ సింగ్ కోసం పోలీసులు వేట ప్రారంభించారు. ఆమెపై లుక్ ఔట్ (దేశం విడిచిపోకుండా) నోటీసు జారీ చేశారు. ఆమెతోపాటు దేరా ముఖ్య అనుచరుడు ఆదిత్య ఇన్సాన్‌పైనా లుక్ ఔట్ నోటీసు జారీ అయింది. అత్యాచారం కేసులో ఆగస్టు 25న సీబీఐ ప్రత్యేక కోర్టు దేరా బాబాను దోషిగా ప్రకటించిన వెంటనే ఆయన్ను తప్పించి, రహస్యప్రాంతానికి తరలించేందుకు వీరిద్దరూ కుట్ర పన్నినందుకు వారిపై రాజద్రోహం కేసు నమోదు చేశారు. దేరాబాబాకు కోర్టు శిక్ష విధించిన నాటి నుంచి వీరి జాడ లే దు. వీరు నేపాల్ పారిపోయి ఉంటారన్న ప్రచారం ఉంది. తనకు కేటాయించిన జైలు గదిలో బాబా రోజంతా రోదిస్తూ గడుపుతున్నాడు. ఈ విషయాన్ని ఆయన గది పక్కనే ఉండి శుక్రవారం బెయిల్‌పై విడుదలైన స్వదేశ్ కిరాద్ అనే వ్యక్తి విలేకరులకు వెల్లడించాడు. 'దేవుడా.. నేనేం తప్పు చేశాను.

నాకు జీవించాలని లేదు నన్ను ఉరితీయండి అంటూ బాబా రోదిస్తున్నాడు' అని స్వదేశ్ తెలిపారు. దేరా బాబా పాలు, టీ, బిస్కెట్లు మాత్రమే తీసుకుంటున్నారని స్వదేశ్ చెప్పారు. ఆయన తీరు చూస్తుంటే త్వరలోనే పిచ్చివాడుగా మారిపోయే సూచనలు కనిపిస్తున్నాయని అన్నాడు. బాబాకు జైలు గదిలో ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పించలేదన్నాడు. బాబా అనుచరులు సృష్టించిన విధ్వంసం పై జైలులోని ఖైదీలు ఆగ్రహంగా ఉన్నారని, బాబాను ప్రత్యేక గదిలో ఉంచకపోయినట్లయితే వారు ఆయనపై దాడి చేసేవారని తెలిపాడు. కాగా, దేరా బాబా స్వస్థలమైన రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో బాబాపై స్థానికుల్లో భ్రమలు తొలగిపోతున్నాయి. ఇళ్లలో పెట్టుకుని పూజించిన ఆయన ఫొటోలను మురుగుకాల్వల్లో పడేస్తున్నారు.

# వచ్చేనెల 6-8 తేదీల్లో 'జలసిరికి హారతి'

**రా.వా.ప్రతినిధి, అమరావతి :** వచ్చేనెల6,7,8 తేదీల్లో 'జలసిరికి హారతి' కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. నదుల దగ్గర నుంచి చెరువుల వరకు రాష్ట్రంలోని అన్ని జలవనరులను ఆ మూడు రోజులు పూజించు కునేలా, ఇందులో ప్రజలు భాగస్వామ్యులు అయ్యేలా చూడాలని సూచించారు. సోమవారం తన కార్యాలయంలో పోలవరం సహా 28 ప్రాజెకుట్టల పనులపై జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 38వ సారి పోలవరం పనుల పురోగతిపై వర్చువల్‌ఇన్‌స్పెక్షన్ చేశారు.



వర్షాల కారణంగా ఈ నెల మొదటి రెండు వారాల పనులు ఆలస్యమయ్యాయని, అయితే ఎన్నడూ లేనంగతా ఈ వారం మాత్రం రికార్డు స్థాయిలో 21,226 క్యూబిక్ మీటర్ల వరకు స్పిల్‌వై, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు జరిగాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. అయితే రోజుకు కాంక్రీట్ పనుల సరాసరి 3,050 క్యూబిక్ మీటర్ల మేర మాత్రమే చాలవని, 4 వేల నుంచి 5 వేల క్యూబిక్ మీటర్ల వరకు పనుల వేగం పెరగాలని ముఖ్యమంత్రి సూచించారు. స్పిల్ చానల్, లెఫ్ట్ ఫ్లాంక్‌కు సంబంధించి రెండున్నర లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకం, రేడియల్ గేట్లు, 15 ఆర్మ్ గ్రిడర్ల ఫ్యాబ్రికేషన్ పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ నె 24న పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ సమావేశమై ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణం తీరు తెన్నులను సమీక్షించిందని, గిరిజనులకు న్యాయంచేస్తూ, ముంపు ప్రాంతాలలో భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. సెప్టెంబరు 15 నాటికి యాగ్రిగేట్ కూలింగ్ ఫ్లాంట్ సిద్ధమవుతుందన్నారు. విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రెండ్రోజులు భారీ వర్షాలు కురుస్తాయని, సెప్టెంబర్‌లో కాస్త తగ్గుముఖం పడతాయని ముఖ్యమంత్రి దృష్టికి ఇస్రో అధికారులు తీసుకొచ్చారు. భూగర్భజలాలు సమృద్ధిగా వున్నాయని అధికారులు చెప్పడంతో కొత్తగా అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

# మైనార్టీల అభివృద్ధికి ఎంఎస్‌డీపీ

### రాష్ట్రస్థాయి కమిటీ సమావేశంలో సీఎస్ దినేష్‌కుమార్

**రా.వాప్రతనిధి , అమరావతి :** రాష్ట్రంలో మైనార్టీలు అధికంగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు జిల్లాల్లో మైనార్టీల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎంఎస్‌డీపీ)ని అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్ కుమార్ వెల్లడించారు. ప్రధాన మంత్రి 15 సూత్రాల కార్యక్రమంలో భాగంగా మైనార్టీల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కమిటీతో బుధవారం వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో సీఎస్‌సమీక్ష నిర్విహించారు. ఈ సమావేశంలో దినేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 12వ పంచవర్ష ప్రణాళిక కాలంలో మైనార్టీల ఆర్థిక, సామాజికాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సాధించిందని,2008 లో మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎంఎస్‌డీపీ)ను ప్రారంభించిందన్నారు. మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించి ఆర్థికంగా, సామాజికంగా వారి జీవన ప్రమాణాలను మెరుగు పర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. మైనార్టీలకు మెరుగైన విద్యను అందించడంతో పాటు నైపుణ్యతను పెంపొందించడం, ఆరోగ్యం, పారిశుధ్య పరిస్థితలను మెరుగుపర్చడం, పక్కా ఇళ్ల నిర్మాణం, రహదారులు, తాగునీరు వసతి కల్పించడతో పాటు వారికి ఆదాయ వనరులు సమాకూర్చే కార్యక్రమాలను చేపట్టడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రస్తుత పతకాలు, ప్రాజెక్టుల్లోని అంతరాలను పూరించడం ద్వారా మెరుగైన రీతిలో పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు వీలుగా అదనపు వనరులను సమాకూర్చేందుకు ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు కింద ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో




వెనుకబడిన మైనార్టీ జనాభా నివసిస్తున్న11 ప్రాంతాలను ఈ ప్రాజెక్టు కింత గుర్తించి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది 50 కోట్ల వ్యయంతో 500 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించేందుకు, అలాగే రూ. 12 కోట్లతో 100 ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సమావేశంలో అధికారులు ఆమోదించారు. కడప జిల్లా ప్రొద్దులూరులో రూ. 23 కోట్లతో బాలికల రెసిడెన్సియల్ పాఠశాల భవనం, రూ. 4.57 కోట్లతో మైనార్టీ జూనియర్ కళాశాల, రాయచోటలో రూ. 18కోట్లతో బాలుర రెసిడెన్సియల్ పాఠశాల భవనం, కోటి వ్యయంతో సభవ్ మండప్ నిర్మాణాలకు ప్రతిపాదనలు వచ్చాయని, ఆ నిర్మాణాలను చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని దినేష్‌కుమార్ ఆదేశించారు. గుంటూరు జిల్లాలో అదనపు తరగతి గదుల నిర్మాణాలనికి అవసరాన్ని బట్ట చర్యలు తీసుకోవాలని, జిల్లాల వారిగా పనుల ప్రగతిని, రావాల్సిన ప్రతిపాదనలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని దినేష్‌కుమార్ ఆదేశించారు. మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్యకార్మదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎంఎస్‌డీసీ పథకం క్రింద ఇప్పటికే వివిధ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ పథకం క్రింద గత ఏడాది రూ. 73 కోట్ల నిధులు మంజూరు కాగా వాటిలో రూ. 47 కోట్లు విడుదలయ్యాయని, రూ. 23 కోట్లకు సంబంధించి వినియోగ పత్రాలు(యూసీలు) సమర్పించారని సీఎస్‌కు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు లింగరాజ్ ప్రాణిగ్రహి, ఎల్.వి. సుబ్రహ్మణ్యం, పట్టాణాభివృద్ధి శాఖకు చెదిన కరికాలవలవన్, స్త్రీశిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సునీత, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి హేమామునియప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్వతంత్ర బావుటా ఎగరేసిన ఖాన్ బహదూర్

**ఖాన్ బహదూర్ ఖాన్ (1781-1860)**

12 పరాయి పాలకుల కబంధహస్తాల నుండి మాతృభూమిని విముక్తం చేసేందుకు తిరుగుబాటు శంఖారావం పూరించిన రొహిల్‌ఖండ్ అధినేత ఖాన్ బహదూర్ ఖాన్ 1781లో జన్మించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు కల్పించిన అధికార పదవిని వదులుకొని 70 ఏండ్ల వయస్సుడైన ఖాన్‌సాబ్ 1857 మే 31న రోహిత్‌ఖండ్ రాజధాని బరేలిలో స్వతంత్ర బావుటాను ఎగురవేశారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, ఆంగ్ల అధికారులను మట్టి కరిపించి రోహిల్‌ఖండ్ నుండి తరిమి కొట్టారు.ఈ సందర్భంగా రోహిల్‌ఖండ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భారత్‌దేశ ప్రజల్లారా! అని సంబోధించి చరిత్ర సృష్టించారు. 'మన పవిత్ర స్వాతంత్ర్య దినోత్సవం ఉదయించింది. ఆంగ్లేయులు మోసాలకు పాల్పడవచ్చు. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులనూ, హిందూవులకు వ్యతిరేకంగా ముస్లింలనూ రెచ్చగొడతారు. ముస్లింలారా! మిరూ పవిత్ర ఖురానును గౌరవిస్తున్నట్టయితే, హిందూవుల్లారా! మిరూ గోమాతను ఆరాధిస్తున్నట్టయితే, మిలోని స్వల్ప విభేదాలను మరచి ధర్మయుద్ధంలో చేతులు కలపండి. ఒకే పతాకం కింద పోరాడండి. మన హిందూస్థాన్ మిద ఆంగ్లేయుల పెత్తనం సృష్టించిన మరకలను మీ రక్తంతో శుభ్రం చేయండి', అంటూ హిందూ–ముస్లింలకు పిలుపునిచ్చారు. నిజాయితీపరుడిగా ఖ్యాతిగాంచిన శోభారాం ప్రధానమంత్రిగా, రణరంగ యోధుడు ముహమ్మద్ భక్త్ ఖాన్ సేనానిగా ఖాన్ బహదూర్ ఖాన్ ప్రజల పాలకుడిగా భాధ్యతలు స్వీకరించారు. స్వతంత్రతకు ప్రతీక అయినటువంటి ఆకుపచ్చ జెండా రోహిల్ ఖండ్‌లో రెపరెపలాడటం చూసి ఆంగ్లేయులు అదిరిపడ్డారు. హిందూ సోదరుల మనోభావాలను గౌరవిస్తూ



ముస్లింల పర్వదినాన గోవుల ఖుర్బాని ఖాన్ బహదూర్ ఖాన్ నిషేధించారు. ఆ స్ఫూర్తితో ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను, హిందూవులకు వ్యతిరేకంగా ముస్లింలను మభ్యపెట్టి, రెచ్చగొట్టి, డబ్బు సంచులతో ప్రజల దేశభక్తిని కొనుగోలు చేసేందుకు ఆంగ్లేయులు సాగించిన కుటిల ప్రయత్నాలను ప్రజానీకం త్రిప్పికొట్టిన వైనాన్ని ఆంగ్లేయాధికారులే తమ నివేదికలలో పేర్కొన్నారు. చివరకు అపార సైనిక బలగాలతో ఆంగ్లేయ సైన్యాధిపతులు ఖాన్ బహదూర్ ఖాన్ కేంద్ర స్థానమైన బరేలిని చుట్టు ముట్టారు. ఆంగ్ల సైన్యాలతో చివర నిమిషం వరకు పోరాడి, గత్యంతరం లేని పరిస్థితులలో కొద్దిపాటి సైన్యంతో 1858 మే 5న బరేలీ నుండి నేపాల్ అడవుల్లోకి ఖాన్ బహదూర్ ఖాన్ తప్పుకున్నారు. ఆంగ్లేయుల అనుకూలుడు నేపాల్ పాలకుడు జంగ్ బహుదూర్ రోహిల్లా నేత ఖాన్ బహుదూర్ ఖాన్ ఏమాత్రం సహకరించకపోగా, ఆయనను ఈస్ట్ కంపెనీ అధికారులకు అప్పగించాడు. ఆంగ్లేయులు విచారణ తంతు జరిపి ఆయన తోపాటుగా తిరుగుబాటులో పాల్గొన్న 243 మందికి ఉరిశిక్ష ప్రకటించారు. ఆ శిక్షలను బరేలిలోని బ్రిటిష్ కమీషనర్ పాత కార్యాలయం ఆవరణలో గల పెద్ద మర్రిచెట్టు వద్ద 1860 మార్చి 24న ఏకకాలంలో నిర్వహించడంతో సహచరులు, అనుచరులతోపాటు ఖాన్ బహదూర్ ఖాన్ 'మా తజేం సలాం' అంటూ మాతృభూమి మట్టిలో ఐక్యమయ్యారు.

**(ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు ఆల్బమ్ 'చరితార్థులు' నుంచి....)**

**- సయ్యద్ నశీర్ అహ్మద్, 9440241727**

## మైనార్టీలకు 500 అంగన్‌వాడీ కేంద్రాలు

**రా.వాప్రతినిధి,విజయవాడ :** బక్రీద్ కానుకగా మైనార్టీలకు 500 అంగన్‌వాడీ కేంద్రాల కోసం రూ. 50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.డి. హిదాయత్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సొంతభవనాల కోసం ఒక్కోదానికి రూ. 10లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. మైనార్టీల యువతీ, యువకుల కోసం, విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. నైపుణ్యాభివృద్ధి, విదేశీ విద్య, విద్యోన్నతి పథకాల ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలను కలిగిస్తున్నామని వివరించారు. ఉపాధి కార్యక్రమాల కింద లక్ష రూపాయల బ్యాంకు లింకేజీ అనుసంధాన ప్రక్రియలో భాగంగా 14 వేల మంది ముస్లిం యువతకు చేయూతనిచ్చామని, ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో అమలు చేస్తున్నందున సీఎం చంద్రబాబుకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మూడేళ్లలో రూ. 2,840 కోట్లపైగా నిధులకు మంజూరు చేసిందని వెల్లడించారు. సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మోహిద్దిన్, ఇందాద్‌ఘుర్ సెక్రటరీ ఫితోజ్, లాల్‌వజీర్, సయ్యద్ సుభాని పాల్గొన్నారు.

## ఉత్తమఉపాధ్యాయురాలిగా గంజిమార్తాజయరావుకు సత్కారం

**రాయపూడి :** ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా 25 ఏళ్లపాటు విద్యాబోధన చేసిన గంజి మార్తాజయరావును 'ఉత్తమ ఉపాధ్యాయురాలి'గా సత్కరిస్తున్నామని ఎస్.ఆర్.వి.ఎస్. & ఎన్.ఎస్.ఆర్, ఎస్.జె.టి. & జె.వి.బి. డిగ్రీ కళాశాలల డైరెక్టర్ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు తెలిపారు. తుళ్లూరు కళాశాలల ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో రాయపూడి ఎం.పి.యు.పి. స్కూల్ విద్యార్థులను అత్యున్నత శిఖరాలు చేరుకునేలా తీర్చిదిద్దిన గంజి మార్తాజయరావుగారికి సత్కారం చేయనున్నారు. గ్రామీణ నేపథ్యంలో చదువుకుని తన స్వగ్రామమైన పెద పణిదరంలో ప్రధానోపాధ్యాయురాలుగా వెలగపూడి,మోతడక, పొన్నెకల్లు, రాయపూడిలో తన భర్త దివంగత ప్రధానోపాధ్యాయులు గంజి జయరావుగారితో కలిసి ఈ ప్రాంతంలో విద్యావ్యాప్తికి చేసిన కృషి ప్రశంసనీయమని పూర్వవిద్యార్థి, రాజధానివార్తలు ఎడిటర్ హుస్సేన్‌ఖాన్, పలువురు పూర్వ విద్యార్థులు తెలిపారు.

## సముద్రంగా మారిన ముంబై



దేశ ఆర్థిక రాజధాని ముంబైలో కురిసిన భారీ వర్షాలుకు సముద్రంలా మారిపోయింది. సాధారణం కన్నా తొమ్మిది రెట్లు ఎక్కువగా వర్షం కురవడంతో వీధులన్నీ నదులను తలపించాయి. అడుగు బయటపెట్టే పరిస్థితి లేకపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎటుచూసినా వరదనీరే! బయటకు వెళ్లే పరిస్థితి లేకపోయింది ఆఫీసులకు వెళ్ళిన ఉద్యోగులు తిరిగి ఇంటికి వెళ్ళలేకపోయారు. దీంతో రాత్రంతావారు ఆఫీసులోన్నే గడపాల్సి వచ్చింది. కొందరు సమీపంలోని తమ బంధువులు, సహ ఉద్యోగుల ఇళ్లకు వెళ్లారు. ముంబయి వ్యాప్తంగా విద్యాసంస్థలు, కార్యాలయాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మరోవైపు వరదల నేపథ్యంలో క్యాబ్ సర్వీసులు ఉచితంగా అందిస్తామని ప్రకటించాయి. కాగా వరద బాధితుల కోసం భారత నేవీ సిబ్బంది కమ్యూనిటీ కిచెన్లు, ఫుడ్ కౌంటర్లు తెరిచారు. నటుడు హర్షవర్ధన్ ( అవును, ఫిదా)వరదలో చిక్కుకు పోయిన వారిని తన కారులో ఎక్కించుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో హీరోగా మారాడు.

టెక్ మహీంద్ర అధిపతి తన స్నేహితుడు భారీ వర్షాల్లో ఐదుగంటపాటు వరదనీటిలో చిక్కుకొని కారులో ఉండిపోగా, సమీప బస్తీలోని ఒకర వచ్చి వేడిటీ కొన్ని బిస్కెట్లు ఇచ్చి వెళ్లారని సోషల్ మీడియాలో తెలపడం వైరల్‌గా మారింది. ఆపదలో ఉన్న ఒక్కరికోసం అన్ని మత ద్వారాలు తెరుచుకున్నాయన్నారు.

**గురుద్వారాకు విదేశీ కుంటుంబ కృతజ్ఞతలు**

స్థానికులకే దారుణ పరిస్థితులను చవిచూస్తే పర్యాటకుల సంగతి వేరే చెప్పనక్కర్లేదు. పారిస్‌కు చెందిన ఓ కుటుంబానికి అలాంటి పరిస్థితే ఎదురైంది. అయితే, స్థానిక గురుద్వారా నిర్వాహకులు ఆదుకుని మానవత్వం చాటుకున్నారు. వారు పారిస్ చేరుకున్నాక సాయాన్ని గుర్తుచేసుకుంటూ గురుద్వారా నిర్వాహకులకు లేఖ రాసి కృతజ్ఞతలు తెలిపారు.

దీనిపై ఆశ్రమ నిర్వాహకుడు హర్జిందర్ మాట్లాడుతూ.. 'పారిస్‌కు చెందిన బొలెస్లాస్కి తన భార్య, ముగ్గురు కుమార్తెలతో కలిసి భారత పర్యటనకు వచ్చాడు. మహారాష్ట్రలోని ఉదయ్‌పూర్ నుంచి రాజస్థాన్‌లోని ఔరంగాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో భారీ వర్షాల కారణంగా ఔరంగాబాద్ వెళ్లే రైలును ముంబయిలో నిలిపివేశారు. దీంతో ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి ఏదైనా హెూటల్‌లో బస చేద్దామని బయలుదేరాడు. కానీ, ఎక్కడికి వెళ్లినా గదులు ఖాళీగా లేవని తెలపడంతో దిక్కుతోచని స్థితిలో నిలబడ్డాడు. ఇంతలో ఇద్దరు బాలురు ఆ కుటుంబాన్ని గురుద్వారా ఆశ్రమానికి తీసుకువచ్చారు. ఆశ్రమంలో వారికి ఒక చిన్న గదిని కేటాయించి.. ఆహారం, తాగునీరు అందించాం. ఆ తర్వాత బొలెస్లాస్కి తన కుటుంబంతో కలిసి పారిస్ వెళ్లిపోయాడు' అని హర్జిందర్ తెలిపారు. అనంతరం అక్కడి నుంచి వారు నిర్వాహకులకు లేఖ రాస్తూ 'ప్రియమైన స్నేహితులారా, వర్షాల కారణంగా ముంబయిలో చాలా కష్టాలు ఎదుర్కొన్నాం. మీరు మాకు ఆశ్రయం కల్పించడమే కాదు ఎంతో దయతో మమ్మల్ని స్వాగతించారు. భారత పర్యటనలో ఒక చేదు అనుభవంతో పాటు ఓ మంచి అనుభవం నా సొంతమైంది. గురుద్వారా ఆశ్రమ నిర్వాహకుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. దయచేసి నేను అందించే ఈ ఆర్థిక సాయాన్ని అందించారన్నారు.

# బాబోయ్.. బాబాలు



భారతీయ పురాణాలు ముక్కోటి దేవతల గురించి చెబుతాయి. అంతకు మించి ఉన్న బాబాలు, స్వయం ప్రకటిత దేవుళ్లు, ఆశ్రమాలు, ఇత్యాదులు చాలానే ఉన్నాయి. వారంతా ప్రజల్ని మాటలతో మైమరపించి, మూకుమ్మడి హిప్నటిజానికి పాల్పడుతుంటారు. పైకి ఒకటి, లోన మరొకటిగా ఉంటుంది వారి ప్రవర్తన. ముందు భక్తివిశ్వాసాలను పెంచి ఆపై వారి వికృత రూపాలను పైకి కనపడకుండా అరాచకాలకు పాల్పడుతుంటారు. ఇవన్నీ గుర్మీత్ రాం రహీం సింగ్‌తోనే మొదలవ్వలేదు, ఆయనతోనే అంతమూ అవ్వవు. నిజానికి ఆకలిదప్పులు, సామాజిక భద్రత లేని జీవితాలు, కనుచూపు పరిధిలో కనపడని సామాజిక న్యాయం ప్రజలను గుడ్డి నమ్మకాలవైపు నడిపిస్తుంది. ప్రజాస్వామ్యంలోని వ్యవస్థల పతనాల మూలంగానే ఇలాంటివి ఏర్పడతాయి. వీటిని అరికట్టడం చాలా సులువు. కాని పాలకులకు కావాల్సింది అసమానత, విభజన వీటిని ఎగదోసి తమ పబ్బాలను గడుపుకుంటున్నారు. దానిలో భాగమే ఉత్తరదేశంలోని ఢిల్లీతో సహానాలుగు రాష్ట్రాల్లో జరిగిన అల్లర్లు.

మొదట్లో డేరా బాబాలు సమసమాజం కోసం కృషిచేసిన మాట వాస్తవం..అయితే రానురాను వారికి కూడా కీర్తి కండూతీ, డబ్బు వ్యామోహం చేరడమే..పతనానికి నాందిపలికింది. ఉన్నత కులాలన్నీ గౌరవమర్యాదలు పొందుతూ గుడులు గోపురాలు కట్టించుకుంటుంటే దళితులు 30 శాతం ఉన్న పంజాబ్ హర్యానాల్లో గుడారాల్లో బోధనలు సాగించే ఈ బాబాల వద్ద మనశాంతిని వెతుకునేవారు. వారికి బ్రతుకుపై ఆశపుట్టించడమే కాకుండా విద్యావైద్యాలు కూడా అందించడంతో వాటినే సర్వస్వంగా భావించేవారు నిమ్నజాతులు. స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు ముగిసినా నిమ్నవర్గాలకు సామాజిక న్యాయం అందలేదని చెప్పటానికి ఈ దేరాబాబాలు విస్తరించడమే రుజువు. పంజాబ్ హర్యానాల్లో సుమారు 10 వేల డేరాలు వర్ధిల్లుతుంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో తెలుపుతోంది. డేరా కార్యక్రమాలో పాల్గొనడం మహత్తర విధిగా భావించి తల్లిదండ్రులు తమ పిల్లలను సాధ్వులుగా పంపుతారు. అలా బలియిన బాధితురాలి వేసిన కేసే ఇది. ప్రజల్లో హేతువాద ధృక్పదాన్ని పెంచాల్సిన ప్రభుత్వాలు పుక్కింటి పురాణాలను ప్రచారం చేయడంతో దేశానికి ఈ స్థితి దాపురించింది. అంతకుముందు కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన గుర్మీత్ 2014లో బీజేపీకి అండగానిలిచారు. హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌తో సహా 18 మంది మంత్రులు ప్రభుత్వం చేపట్టిన వెంటనే వెళ్లి ఆయనకు పాదాభివందనం చేశారు. 2014లో పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ ఆయన భార్య, కుమారుడు ఓట్లకోసం వెళ్లి ఆయనకు పాదాభివందనం చేశారు. ఇలాంటి క్రమంలో సామాన్యులు ఆయనకు అతీతశక్తులున్నాయనీ, అనితరసాధ్యుడని నిలువెల్లా నమ్మిన ప్రజలు ఒక్కసారిగా ఎదురు తిరగడంలో ఆశ్చర్యం ఏముంది ? భద్రతాకారణాలతో గుర్మీత్ జైల్లోనే తీర్పువెలువరించిన సీబీఐ న్యాయమూర్తి ఇద్దరు బాధిత సాధ్వీలకు ఒక్కొక్కరికి పేదేళ్ల చొప్పున 20 ఏళ్ల కఠిన కారాగార వాసం విధించారు. ఈ న్యాయాన్ని ఇతరబాబాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే కల్కిభగవానుడు, సచ్చిదానందస్వామి, రాంపాల్ ఇంకా బయటికిరావాల్సిన వారు ఇంకా ఎందరో ఉన్నారు. వేదాలు పుట్టిన చోట దెయ్యాలు చాలానే ఉన్నాయి. వారి బండారం ఎప్పటికి బయటికి వస్తుందో మరి..

**ఖట్టర్ ప్రభుత్వం వరుస వైఫల్యాలు**

బీజేపీ ప్రభుత్వాల్లో బాగాబలహీనమైన ప్రభుత్వం హర్యానాదే.ఇప్పటికే అనేకసార్లు శాంతి భద్రతలను కాపాడటంలో మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వం విఫలం చెందింది. అవినీతి రహిత ప్రభుత్వం, సుపరిపాలన అందిస్తోంది అని ముఖ్యమంత్రి ఎంత ప్రచారం చేసుకుంటున్నా వాస్తవ పరిస్తితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. స్వయం ప్రకటిత బాబా రాంపాల్ ప్రైవేటు సైన్యం రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తూ 2014లో శాంతిభద్రతలకు తీవ్ర ముప్పుగా మారినప్పటికీ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యింది. సైన్యం ఆయన ఆశ్రమంలోకి ప్రవేశించడానికి సుమారు 10రోజులు పట్టింది. 2016 ఫిబ్రవరిలో జాట్ల ఆందోళనల్లో 30 మంది మృతి చెందగా, 200 మందికి పైగా గాయపడ్డారు. మొన్న గుర్మీత్ బాబా తీర్పులో 34 మంది మరణించగా, మరో 250 మందికి గాయాలైన విషయం తెలిసిందే. 34 నెలల ఖట్టర్ పాలనలో పోలీసులను, ముఖ్యకార్యదర్శులతో సహా అనేక మందిని తరచూ బదిలీ చేస్తుంటారు. అంతకు ముందు ఆర్ ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన ఖట్టర్‌కు అంతకు ముందు ఎమ్మెల్యేగా కూడా అనుభవం లేకపోవడంతో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయని చెప్పవచ్చు. అయినా బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమితసషా, ప్రధాని మోడీలు ఆయనకు వంతపాడటం గమనార్హం.

## ఇదీ.. దేశపరిస్థితి



చదువులో మేటి అయిన వాళ్లంతా సాంకేతిక విద్యావకాశాలను అందిపుచ్చుకొని డాక్టర్లు, ఇంజనీర్లు అవుతారు.



సెకండ్‌క్లాస్‌లో పాసయిన వాళ్లంతా ఐఐఎంల్లో సీట్లు పొంది మేనేజ్‌మెంట్ కోర్సులు చదివి మొదటి వాళ్లను నియంత్రిస్తారు.



థర్డ్‌క్లాస్‌లో పాస్ అయిన వారంతా రాజకీయాల్లో ప్రవేశించి మంత్రులై పై వారిని పాలిస్తుంటారు.



ఫెయిల్ అయిన వారంతా అండర్‌వరల్డ్ డాన్‌లుగా తయారై పై మూడుతరగతుల వారిని పాలిస్తారు.



బడికి వెళ్లని వాళ్లంతా స్వామీజీ, గురువులు, బాబాలుగా అవతరిస్తారు. డాక్టర్లు, ఇంజనీర్లు, మేనేజర్లు, మంత్రులు, వారి దగ్గరికే వెళ్లి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

## పతంజలి Vs ఎంఎస్‌జీ



గుర్మీత్‌పై అత్యాచారం కేసును బయటికి తెచ్చింది ఆయన దేశ, విదేశ సంస్థలను భయంకరంగా దెబ్బతీసేందుకేనని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విమర్శలను కొట్టి పారేయలేం.ఎందుకంటే అంతకు ముందుకూడా నెస్లేకంపెనీ ఉత్పత్తి చేసిన మ్యాగీ నూడిల్స్‌లో పురుగులున్నాయని , హానికరమైన ఆర్సనిక్ ఉందని అందమైన ప్యాకెట్లలో పెట్టి పిల్లలకు ఎరవేస్తున్నారని ఒక ప్రొఫెసర్ కోర్టుకెళ్లారని విస్తృత ప్రచారం జరిగింది. దాంతో భారత్ ప్రభుత్వం మార్కెట్ నుంచి వాటిని బహిష్కరించింది. దీన్ని చూసి వేలం వెర్రిగా మిగతా దేశాలు కూడా అనుసరించాయి. టీవీలు చూస్తూ బాధ్యత మరచిన తల్లులు రెండు నిమిషాల్లో రెడీ అయిపోయే నూడిల్స్‌ను అలవాటు చేశారని రాందేవ్ బాబా విరుచుకుపడ్డారు కూడా..అయితే ఒక శుభోదయాన పతంజలి నూడిల్స్ మార్కెట్లోకి రావడంతో అందరూ తెల్లబోయారు. అయితే పతంజలి నూడిల్స్ మ్యాగీ నూడిల్స్ అంతగా పిల్లలను ఆకట్టుకోలేకపోయాయి. ఇదే సమయంలో మరింత మేలైన పదార్థాలతో పిల్లలకోసం మ్యాగీన్యూట్రిలియష్ ప్రవేశపెట్టామని అమ్మకాలు ప్రారంభించగానే లక్షల సంఖ్యలో అమ్ముడయ్యాయి. బీజేపీ ప్రభుత్వం వచ్చినతర్వాత పతంజలి లాభాల పంట పండుతోంది. ప్రస్తుతం ఎంఎస్‌జీ పతంజలికంటే మరిన్ని ఉత్పత్తులు చేపట్టింది. నూడుల్స్ మంచినీరు, బియ్యం, పిండి, నెయ్యి, తేనే లాంటి 150 పైగా ఆర్గానిక్ పదార్థాలను దేశంలోనే కాకుండా అమెరికా, యూకే, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా ఖండాలకు ఎగుమతి చేస్తోంది. దీంతో కావాలనే పతంజలి మార్కెట్‌ను పెంచుకోవడం కోసం గుర్మీత్‌ను దెబ్బకొట్టారని మరొక వాదన ఉంది. అంటే 'భారతీయం' అనే పేరుతో బాబాలు జరిపే వ్యాపారంలో ఒక సంస్థను దెబ్బకొట్టి మరొక సంస్థ మార్కెట్‌ను పెంచుకోవడం అన్నమాట.








రాయపూడిలో ఈదుల్‌అధా పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

## వైభవంగా క్రీడా పురస్కారాల ప్రదానం

- అవార్డులు అందించిన రాష్ట్రపతి కోవింద్
- ధ్యాన్‌చంద్‌కు క్రీడా మంత్రి ఘన నివాళి



**ఢిల్లీ :** భారత హాకీ దిగ్గజం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పుస్కరించుకుని ఢిల్లీలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ప్రతిష్టాత్మక అర్జున, ఖేల్‌రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా క్రీడాకారులు అవార్డులు అందుకున్నారు. దేశ అత్యున్నత పురస్కారమైన ఖేల్‌రత్నను'ను రియో పారాలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన దేవేంద్ర ఝుజారియా, హాకీ క్రీడాకారుడు సర్దార్ సింగ్ అందుకున్నారు. తొలుత కేంద్ర క్రీడా శాఖమంత్రి విజయ్ గోయల్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజుజు హామీ మాంత్రికుడు ధ్యాన్‌సింగ్ విగ్రహానికి పూల దండ వేసి నివాళులర్పించారు. అర్జున అవార్డులను చతేశ్వర పూజరా(క్రికెట్), దేవేంద్ర సింగ్(బాక్సింగ్), హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), వెన్నం జ్యోతి సురేఖ (ఆర్చరీ), కుష్‌బీర్‌కౌర్ (అథ్లెటిక్స్), బెంబబెం దేవి(ఫుట్‌బాల్), ప్రకాశ్ నంజప్ప (షూటింగ్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), రాజీవ్ అరోకియా (అథ్లెటిక్స్), సాకేత్ మైనేని(టెన్నిస్), సత్యవర్త్ కడియన్ (రెజ్లింగ్), శివ్ చౌరాసియా, ఎస్వీ సునీల్ (హాకీ), తంగవేలు మరియప్పన్ (అథ్లెటిక్స్), వరుణ్ సింగ్ భాటి(పారాఅథ్లెట్), ఎస్ఎస్‌పీ చౌరాసియా(గోల్ఫ్), జస్వీర్ సింగ్(కబడ్డీ), పీఎన్ ప్రకాష్ షూటింగ్), అమల్‌రాజ్

## క్రీడలు

(టేబుల్ టెన్నిస్) రాష్ట్రపతి కోవింద్ నుంచి స్వీకరించారు. రాష్ట్రీయ ఖేల్ ప్రోర్ట్ అవార్డును రిలయన్స్ ఫౌండేషన్ యూత్ స్పోర్ట్స్ గెలుచుకుంది. రాష్ట్ర పతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా నీతా అంబానీ ఈ అవార్డును అందుకున్నారు. ద్రోణాచార్య అవార్డులను జీఎస్ఎస్‌వీ ప్రసాద్ (బ్యాడ్మింటర్), బ్రిజ్ భూషణ్ మహంతి (బాక్సింగ్), రోషన్ లాల్ (రెజ్లింగ్), సంజోయ్ చక్రవర్తి (షూటింగ్)లు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. దివంగత డాక్టర్ ఆర్ గాంధీ (అథ్లెటిక్స్) మరణానంతరం ప్రకటించిన ద్రోణాచార్య అవార్డును ఆయన కుటుంబ సభ్యులు రాష్ట్రపతి చేతుల మీదుగా తీసుకున్నారు. ధ్యాన్ చంద్ అవార్డులను భూపేందర్ సింగ్ (అథ్లెటిక్స్), ఎస్ఎస్ హకీమ్ (ఫుట్‌బాల్), సుమ్‌రాయ్ తెతె (హాకీ) స్వీకరించారు.

### జ్యోతి సురేఖకు రూ.కోటి

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్రశ్రేణి అర్చన్ వెన్నం జ్యోత సురేఖకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ. కోటి నజరానాను ప్రకటించారు. ఇటీవల 'అర్జున' అవార్డును అందుకున్న సురేఖ, గురువారం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసింది. ఈ సందర్భంగా ఆయన నగదు ప్రోత్సాహకంతో పాటు విజయవాడలో 500 గజాల ఇంటిస్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు.'సురేఖ రాష్ట్రం గర్వపడేలా చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 70పతకాలు గెలిచింది. దక్షిణ భారత దేశం నుంచి 'అర్జున ' అవార్డు పొందిన అతి పిన్న వయస్సురాలిగా ఘనతకెక్కింది' అని ఏపీ సీఎం ప్రశంసించారు.

## విపరీత ధోరణికి అద్దం పట్టిన అర్జున్‌రెడ్డి



**సినిమా**

సినిమాలు వ్యాపారాలన్నది కాదన్నలేని సత్యం. అయితే అవి వీక్షకుల బలహీనతలపై వసూళ రాబట్టేవిగా ఉండకూడదు. అర్జున్ రెడ్డిలో సభ్యసమాజం తలదించుకునేలా విపరీతపోకడలు, అశ్లీలతలు ఉన్నాయి. డాక్టరుగా హీరో చేసిన, మాట్లాడిన మాటలు కుటుంబ వ్యవస్థను కాపాడుకునే వారెవ్వరూ హర్షించరు. ఇదివరలో సినిమాలన్నీ కుటుంబసమేతంగా ఉండటంతో మహిళలు సినిమాలకు ఎగబడేవాళ్లు. వారొక్కక్కరుగా వెళ్లరు కాబట్టి ఇరుగుపొరుగువారంతా కలసి వెళ్లేవాళ్లు. మహిళలను ఆకర్షించడంకోసం అప్పటి దర్శకులు కడవలకొద్దీ కన్నీరు పెట్టించే సెంటిమెంట్లను పెట్టి వసూళ్లు రాబట్టేవారు. ప్రస్తుతం టీవీల్లోనే అనేక సినిమాలు, సీరియళ్లు ప్రదర్శింతమవడంతో సినిమాహాళ్లకు వచ్చే మహిళల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇదేసమయంలో దేశంలో యువత పెరగడంతో వారిని దృష్టిలో పెట్టుకునే సినిమాలు తీస్తున్నారన్నది యధార్థం. వారిని ఆకర్షించే నెపంతో విపరీత మనస్థత్వంతో సినిమాలు తీస్తున్నారు.

మొన్న విడుదలైన అర్జున్‌రెడ్డి ఆ కోవకు చెందిందే. సినిమాహాళ్లన్నీ కేకలు,కేరింతలతో ఉండటమంటే ఎదిగీఎదగని వయస్సులో 18 చుంబనాలు వారిపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతున్నాయో తెలుసుకోవచ్చు. యువతరానికి గేలం వేయడానికే ముద్దుల సీన్లను వాల్‌పోస్టర్లుగా వేశారని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

పోస్టర్లను చించుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీహెచ్ హనుమంతరావును అర్జున్‌రెడ్డి పెద్దంతరం, చిన్నంతరం లేకుండా మాట్లాడటం 'తాతా చిల్' అంటూ ఫేస్‌బుక్‌లో పోస్టింగులు పెట్టడం సంప్రదాయవాదులకు చిరాకు తెప్పించిన విషయం.. సినిమా పరిశ్రమలోనే అత్యంత పెర్వర్టెర్‌గా పేరుతెచ్చుకున్న రామ్‌గోపాల్‌వర్మ ముద్దు సీన్లన్నింటినీ కలిపి హనుమంతరావుకు పంపమనడం వెకిలి మనస్థత్వాన్ని తెలుపుతోంది. తోటి హీరోయిన్లను మరదళ్లని, చిత్రపరిశ్రమలోని ప్రముఖులను అన్న, తాత, బాబాయ్ అంటూ చెల్లెలి ఫీలింగ్ ఎటువంటితో తెలియదన్నాడు. అంటే సినిమా పరిశ్రమలో ఆర్జీవీ లాగా ఈయనకూడా పర్వెర్టర్ అయ్యారని చెప్పక తప్పదు. అయినా అందరూ పుట్టేది అమ్మకడుపునేగా ఏదో అత్యాధునిక యంత్రానికి పుట్టినట్టు ఆ మాటలేంటి ? ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాల్సింది ఏమంటే సమాజ బాధ్యత అంటూ ఒకటి ఉంటుంది. ఇప్పుడే పెడధోరణులను పెంచి పోషిస్తున్న వారంతా ఏదో రోజు వారు పెంచి పోషించిన ఈ పైశాచికత్వానికి మూల్యం చెల్లించుకుంటారు. కాస్త తెలంగాణ యాసుంటే చాలు,కేసీఆర్,కేటీఆర్‌లు ఆహా..ఓహో అంటారు. రెండోది రాజ్‌మౌళిలాంటి వారుకూడా బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరంఉంది. సినిమా అంటే అన్ని వయస్సుల వారూ వీక్షించేది కాబట్టి అందరూ బాధ్యతాయుతంగా మెలగాలి. **విజయం అంటే కేవలం కలెక్షన్లు మాత్రమే కాదు.. మనుష్యుల్లో ఎంతోకొంత పాజిటివ్ ఆలోచనలు పెంచేదిగా కూడా ఉండటం అవసరం.**



1980ల్లో ఇలాగే పెడసరంగా మాట్లాడే బాలివుడ్‌నటి నీనాగుప్తా పెళ్లికాకుండానే తల్లి అయ్యారు. దానికి అందరూ ఆక్షేపిస్తే పిల్లల్ని కనడానికి పెళ్లే కావాలా అని సమాజాన్ని హేళన చేశారు. అయితే అప్పుడే పత్రికలు ఘోషించాయి ఆమె తల్లికావడానికి వెస్ట్‌ఇండీస్ క్రికెటర్ వివీయన్ రిచర్డ్ కారణం అని. ఆతర్వాత ఈ విషయంలో ఆమె కూడా పశ్చాతాపం చెందుతూ పెళ్లికాకుండా పిల్లల్ని (కూతురు మసీబాగుప్తా) కనడం అంటే పశువులకు, మనుష్యులకు తేడా లేనట్లే అని ప్రకటించారు. ప్రస్తుతం ఆమె వివేక్ మెహ్రాను సంప్రదాయంగా పెళ్లిచేసుకున్నారు.






Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18